సాక్షి

# వారసత్వ కట్టడాలకు విఘాతం కలగదు

**చార్మినార్, ఫలక్‌నుమాలకు దూరంగానే మెట్రో అలైన్‌మెంట్: ఎన్వీఎస్ రెడ్డి**

**సాక్షి, సిటీబ్యూరో:** చారిత్రక కట్టడాలు చార్మినార్, ఫలక్‌నుమాలకు దూరంగానే పాతబస్తీ మెట్రో అలైన్‌మెంట్ వెళ్లనుందని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఏ ఒక్క చారిత్రక, వారసత్వ కట్టడానికి విఘాతం కలగడం లేదని, ఎక్కడా వారసత్వ కట్టడాలను కూల్చి వేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. పాతబస్తీ మెట్రోరైల్ పనులపై హైకోర్టు స్టే విధించినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి ప్రతిస్పందనగా గతంలోనే హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అందులో.. పాతనగరంలో ఏ వారసత్వ నిర్మాణాన్ని తాకడం లేదా కూల్చివేయడం లేదని హైకోర్టుకు విన్నవించినట్లు వెల్లడించారు. ఈ మేరకు మెట్రోరైల్ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ న్యాయస్థానానికి గతంలోనే హామీ ఇచ్చారని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఆ తర్వాత పిటిషనర్, హెచ్ఏఎంఎల్ అదనపు అఫిడవిట్లు, కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేశాయన్నారు. కొన్ని రోజుల క్రితం పిటిషనర్ దాఖలు చేసిన అదనపు అఫిడవిట్లకు అదనపు అడ్వొకేట్ జనరల్ తమ తరపున ప్రతిస్పందనను దాఖలు చేయడానికి కొంత సమయం కోరారని, ఈ మేరకు సమగ్రమైన కౌంటర్ దాఖలు చేసేందుకు హైకోర్టు 3 వారాల సమయం ఇచ్చిందన్నారు. మధ్యంతర ఉపశమనం ఏదైనా ఇదివరకు ఇచ్చి ఉంటే, తదుపరి విచారణ తేదీ వరకు అది అమలులో ఉంటుందని మాత్రమే హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొందని ఆయన వివరించారు.

### వక్రీకరించారు..

హైకోర్టు ఆదేశాలను వక్రీకరిస్తూ కొందరు తప్పుడు సమాచారం అందిస్తున్నారని ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ప్రభావిత ఆస్తుల యజమానులకు ఇచ్చే కన్సెంట్ అవార్డుల ఆధారంగా సముచితమైన పరిహారం చెల్లించిన తర్వాతే ప్రైవేట్ భవనాల కూల్చివేత పనులు కొనసాగుతున్నాయన్నారు. పాత నగరంలో ఒకదానికొకటి అనుకొని ఉన్న భవనాలు, సంక్లిష్టంగా ముడిపడిన విద్యుత్, టెలికాం, ఇతర కేబుల్ వైర్లను జాగ్రత్తగా తొలగిస్తూ, ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం రాత్రిపూట పనులు చేస్తున్నట్లు చెప్పారు. వారసత్వ కట్టడాలను మినహాయించి మిగిలిన ప్రభావిత ఆస్తులను జాగ్రత్తగా కూల్చివేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. మెట్రో విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి రాత్రింబవళ్లు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు దాదాపు 311 ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని, సహాయ పునరావాస నష్టపరిహారం కింద వాటి యజమానులకు రు. 283 కోట్లు పంపిణీ చేశామని ఆయన తెలిపారు.



కొనసాగుతున్న మెట్రో విస్తరణ పనులు